నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 29 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో బారులు తీరిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులు


## లక్షల విలువైన ప్లాట్లకు
# కోట్లలో ఫీజులా?

**మంచిర్యాల కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్‌పై గందరగోళం**

- కోట్లలో వస్తున్న చార్జీలు చూసి అవాక్కవుతున్న ప్రజలు
- గడువు ముగుస్తున్న వేళ పెద్ద సంఖ్యలో తరలివస్తున్న దరఖాస్తుదారులు

మంచిర్యాల టౌన్, మార్చి 28 : ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)-2020 దరఖాస్తుల పరిష్కారం కోసం 25 శాతం రాయితీ కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రజల్లో గందరగోళం నెలకొంది. ఇప్పటికే పలురకాల కొర్రీలతో దరఖాస్తుదారులు సతమతమవుతుండగా, తాజాగా పలువురికి ఎల్ఆర్ఎస్ ఫీజు కోట్లలో వస్తుండడంతో బెంబేలెత్తి పోతున్నారు. రూ. లక్షల్లో కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలంటే రూ. కోట్లు చెల్లించాలా అంటూ అవాక్కవుతున్నారు. ఇదిలాఉండగా మార్చి 31తో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఫీజు చెల్లించే గడువు ముగుస్తుండడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుంటున్నారు. సిబ్బంది తక్కువగా ఉండటం, ఉన్న సిబ్బందికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో పేర్కొన్న అంశాలపై స్పష్టత లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షెట్టిపేట మండలం హన్మంతపల్లికి చెందిన లక్ష్మికి నస్పూరు శివారులోని 41 సర్వేనంబర్‌లో 288 గజాల ప్లాటు ఉంది. ఆమె 2020లో ఎల్ఆర్ఎస్ కోసం రూ. వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా.. ఈ ప్లాటుకు సంబంధించి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించడం కోసం రాగా రూ. 5,88,11,998 ఫీజు వచ్చింది. ఇందులో నుంచి 25 శాతం రిబేటు పోను రూ. 4,41,07,999 చెల్లించాలని చూపెడుతోంది. మంచిర్యాలకు చెందిన ఆకుల అశోక్ కు సంబంధించి 204 గజాల భూమికి రూ. 13.82 కోట్లు, సంధ్యారాణి అనే మహిళకు సంబంధించిన472 గజాల ప్లాటుకు రూ. 57.59 కోట్లు చెల్లించాలని ఎల్ఆర్ఎస్ వెబ్‌పోర్టల్‌లో చూపెడుతోంది. దీంతో దరఖాస్తు దారులు ఒక్కసారిగా ఖంగుతింటున్నారు. ఎల్ఆర్ఎస్ సైట్‌లో ఏర్పడిన టెక్నికల్ సమస్య వల్ల ఇలా చార్జీలు జనరేట్ అవుతున్నాయని, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకుని కార్యాలయానికి వస్తే సరిచేస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులు కార్పొరేషన్ కార్యాలయంలో బారులు తీరుతున్నారు. గడువు సమీపిస్తున్న కొద్దీ పెద్ద సంఖ్యలో తమ దరఖాస్తులు పరిష్కరించుకోవడానికి తరలివస్తున్నారు. అయితే ఇందుకు సరిపడా సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బందిపై అధిక భారం పడడం, దీనికి తోడు తరచూ సర్వర్ డౌన్ అవడంలాంటి సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కార్పొరేషన్‌గా ఏర్పడకముందు మంచిర్యాల మున్సిపాలిటీతో పాటు నస్పూరు మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల, గుడిపేట, నర్సింగాపూర్, రాపల్లి, పోచంపాడ్, నంనూర్ గ్రామపంచాయితీ పరిధిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వేలాది మంది 2020 సంవత్సరంలో రూ. వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రాంతాలన్నీ నూతనంగా ఏర్పడిన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కలవడంతో ఇప్పుడు వీరంతా ఇక్కడకు తమ దరఖాస్తులను పట్టుకొని వస్తున్నారు. ఎల్ఆర్ఎస్ కోసం 2020 సంవత్సరంలో మంచిర్యాలతో పాటు నస్పూరు మున్సిపాలిటీ, ప్రస్తుతం కార్పొరేషన్‌లో విలీనమయిన గ్రామపంచాయతీల పరిధిలో వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. వీటన్నింటినీ నిర్ణీత గడువు ఈనెల 31లోగా పరిష్కరించి ఫీజులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీలకు ప్రభుత్వం సూచించింది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 23,303 దరఖాస్తులు, నస్పూరు మున్సిపాలిటీలో 4922 దరఖాస్తులు, గ్రామపంచాయితీల పరిధిలో 4874 దరఖాస్తులు చేసుకున్నారు. వేలల్లో దరఖాస్తులు వచ్చినప్పటికీ వందల్లో మాత్రమే ఎల్ఆర్ఎస్ పూర్తిచేశారు. గడువులోగా పూర్తిస్థాయిలో ఎల్ఆర్ఎస్ పూర్తిచేయడం ఎలాగూ సాధ్యపడదని, అందుకే ప్రభుత్వం గడువు పెంచుతుందని పలువురు భావిస్తున్నారు.

బావిలో మోటర్ పైపులు



చెలిమె వద్ద నీరు తోడుకుంటున్న మహిళలు



# తాగునీటికి తండ్లాట

**మామిడిపల్లిలో అందని మిషన్ భగీరథ జలం**

- బావుల వద్ద గంటల తరబడి నిరీక్షణ
- వాగుకు వెళ్లి చెలిమెల నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కన్నెపల్లి, మార్చి 28 : భీమిని మండలం మామిడిపల్లి గ్రామస్తులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. పనులన్నీ వదులుకొని బావులు, వాగుల వెంట పరుగులు తీయాల్సి వస్తున్నది. గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ ఉండగా, కొన్ని చోట్లకు మాత్రమే కొంత నీరు సరఫరా అవుతున్నది. అలాగే రెండు బావులుండగా, ఒక్కోదాంట్లో 20 నుంచి 30 మోటర్లు బిగించారు. ప్రస్తుతం ఎండల తీవ్రతకు నీళ్లు అడుగంటి పోగా, ఉన్న కొద్దిపాటి నీటిని తోడుకునేందుకు తెల్లవారు జామున 4 గంటల నుంచే బారులు తీరుతున్నారు. మొదట వచ్చిన వారికే నీరు దొరుకుతుండగా, మిగతా వారంతా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది. ఇక కొందరు పక్క ఊరి సమీపంలోని వాగులోకి వెళ్లి చెలిమెల నీరు తెచ్చుకొని గొంతు తడుపుకుంటున్నారు. వ్యవసాయం, ఉపాధి పనులన్నీ వదులుకొని తాగు నీటికోసం తల్లడిల్లుతున్నామని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

### మొదట మోటరేసినోళ్లకే నీళ్లు



తాగు నీటి కోసం తిప్పలు పడుతున్నం. ఎండలకు బావిలో కూడా నీళ్లు లేకుంటైయినయి. తెల్లారి 4 గంటలకు లేచి మొదట బోరు వేసినోళ్లకే నీళ్లు దొరుకుతున్నయి. మిగిలిన వారు వాగులు వంకల పొంట తిరుగుతున్నరు. మా గోస పట్టించుకున్నోళ్లు లేరు. ఇప్పటికైనా తాగునీటి సమస్య తీర్చాలి. – ఆదే రేణుక

### వాగులో కూడా ఊట లేదు



ఎండలకు వాగులో కూడా నీళ్లు లేవు. చెలిమెల్లో నీటి ఊట రావడం లేదు. బిందె నిండడానికి మస్తు టైం పడుతున్నం. తాగునీటి కోసం బాధపడుతున్నాం. పనులన్నీ వదులుకొని నీళ్లకోసం తిరుగుతున్నం. సార్లు స్పందించి మా గోస తీర్చాలి. - కొట్రంగి సుజాత

### మస్తు బాధపడుతున్నం



మంచి నీళ్ల కోసం మస్తు బాధ పడుతున్నం. మా గోస పట్టించుకున్నోళ్లు లేరు. ఓట్ల సమయంలో అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని చెప్పి ఇప్పుడు మా ఊరి వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇకనైనా మా బాధలు తీర్చుతరో లేదో.. మరి - ఆదే భారతి



చెలిమె వద్ద మురుగు నీటిని తాగుతున్న మహిళ



చెలిమె వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ

# విరమణ ఉద్యోగంలో భాగమే

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**



గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

రెబ్బెన, మార్చి 28 : ఉద్యోగులకు విరమణ తప్పదని, ఉద్యోగంలో భాగమేనని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి ఎంవీటీసీలో విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్వ్యాలిడేషన్ పొందిన టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు దంపతులకు శుక్రవారం రాత్రి గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కోవ లక్ష్మి, దుర్గం చిన్నయ్య వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ యూనియన్ బలోపేతానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అజ్మీరా బాబురావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పర్లపల్లి వనజ, మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, మాజీ సర్పంచ్‌లు పోటు సుమలత, తోట లక్ష్మణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు మన్యం పద్మ, టీబీజీకేఎస్ నాయకులు మంగిలాల్, మారిన వెంకటేశ్వర్లు, సిరిశెట్టి సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, కార్నాథం వెంకన్న, మాంతు సమ్మయ్య, సంపత్, రాంరెడ్డి, ఓరం కిరణ్, బొంగు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ● బోరంపల్లి, కొల్లూరు ఇసుక క్వారీల సందర్శన



కోటపల్లి మండలం బోరంపల్లి వద్ద ఇసుక క్వారీ వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, మార్చి 28 : 63వ జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. కోటపల్లి మండలం బోరంపల్లి, కొల్లూరు ఇసుక క్వారీలకు వచ్చే లారీలు జాతీయ రహదారిపై పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కలెక్టర్.. డీసీపీ భాస్కర్‌తో కలిసి ఇసుక రీచ్‌లను శుక్రవారం సందర్శించారు. కాంట్రాక్టర్లతో మాట్లాడారు. ఇసుక నింపడంలో జాప్యం కారణంగా జాతీయ రహదారిపై లారీలు పార్కింగ్ చేస్తున్నారని, త్వరగా లోడ్ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం కోటపల్లి తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజావాణి ఫిర్యాదుల ప్రగతిని తహసీల్దార్ రాఘువేంద్ర రావ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రహరీల నిర్మాణ ప్రగతిని ఎంపీడీవో లక్ష్మయ్యను అడిగారు. కోటపల్లి పీహెచ్‌సీని సందర్శించి, కలెక్టర్ రోగులకు న్యాయమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారిణి అరుణశ్రీకి సూచించారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




కౌటాలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

# వైద్యం అందని ద్రాక్షే..!

**కౌటాల పీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యాధికారి లేక ఇబ్బందులు**

కౌటాల, మార్చి 28 : కేసీఆర్ సర్కారులో అత్యుత్తమ సేవలందించి దేశస్థాయిలో అవార్డులు అందుకున్న కౌటాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రస్తుతం వైద్యం అందించలేని దుస్థితికి చేరింది. కౌటాలతో పాటు బెజ్జూర్, చింతలమానేపల్లి మండలాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ పీహెచ్‌సీ.. ప్రభుత్వ పట్టింపులేని తనంతో ప్రాధాన్యం కోల్పోయింది. ఈ దవాఖానలో పనిచేసిన రెగ్యులర్ వైద్యాధికారులు కొన్ని రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. గతేడాది కాంట్రాక్టు పద్ధతిన రిటైర్ట్ వైద్యాధికారి సుంకన్నను నియమించారు. ఆయన కాంట్రాక్ట్ కాలం మార్చి ఒకటితో ముగియగా, విధులకు రావడం లేదు. ఇటీవల కాంట్రాక్ట్ పద్ధతిన నియమించిన మరో యునాని వైద్యాధికారిని తస్లీమా వారంలో మూడు రోజులు వచ్చి వెళ్తున్నారు. రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో స్టాఫ్ నర్సులే వైద్యం అందిస్తున్నారు. గతంలో ఆయుష్మాన్ భారత్‌లో ఉత్తమ సేవలు అందించి.. అవార్డులు పొందిన ఈ దవాఖానలో వైద్యం అందని ద్రాక్షగా మారిందని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యాధికారిని నియమించాలని ఈ ప్రాంత ప్రజలుకోరుతున్నారు.



వైద్యాధికారి లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

# ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికైన మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఎన్నికల కమిషనర్ అనిల్ రాజ్, అసిస్టెంట్ కమిషనర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. 312 మంది సభ్యులు (న్యాయవాదులు) ఉండగా, 287 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి వాతవరణం కనిపించింది. అధ్యక్ష పదవి కోసం బండవరపు జగన్, రంగు మల్లేశ్, పులి రాజమల్లు, కొత్త సత్తయ్య.., మరిన్ని పదవుల కోసం 22 మంది ఇతర న్యాయవాదులు పోటీలో ఉన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించిన అధికారులు అనంతరం కౌంటింగ్ ప్రారంభించారు. బండవరపు జగన్, కొత్త సత్తయ్య మధ్య పోటీ హోరాహోరీగా సాగగా, సత్తయ్యకు 114, జగన్‌కు 136 ఓట్లు పోల్ అయ్యాయి. 22 ఓట్ల మెజారిటీతో రెండోసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్ గెలుపొందారు. అనంతరం పూర్తి కార్యవర్గాన్ని అధికారులు ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్‌గా బుజంగరావు, జనరల్ సెక్రటరీగా మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఆవునూరి సత్తయ్య, ట్రెజరరీగా దత్తాత్రేయ, లైబ్రరీ సెక్రటరీగా రంజిత్ గూడ్, స్పోర్ట్స్ సెక్రటరీగా రంగు వేణుకుమార్, లేడీ రిప్రజెంటేటివ్‌గా బోగె ఉమారాణి, కమిటీ మెంబర్లుగా గాజుల లక్ష్మీప్రసన్న, మల్లేశ్ సందేల, ప్రదీస్ చంద్ర సోమ, సుందూజ కొత్తూరి, శ్రీకాంత్ పెసరను బార్ కౌన్సిల్ సభ్యులు ఓట్లు వేసి గెలిపించారు. అనంతరం ఎన్నికైన సభ్యులు సంబురాలు చేసుకున్నారు. జగన్‌కు పలువురు న్యాయవాదులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

